అభివృద్ధి పనులు తొందరగా పూర్తి చేయాలి


సాయిబాబానగర్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి : కాలనీలలో మంజురైన అభివృద్ధి పనులను తొందరగా పూర్తి చేయాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సాయిబాబానగర్, వడ్డెర బస్తీలలో అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. భూగర్భ డ్రైనేజీ సమస్యలు ,రోడ్ల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక ప్రజలు కార్పొరేటర్‌కు వివరించారు. కాలనీలలో తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ తోకలశ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముందుగా డ్రైనేజీ సమస్యలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ పనులు పూర్తి అయితేనే రోడ్లు వేయడానికి వీలుంటుందని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ జీహెచ్ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ , జలమండలి ఎస్‌బి డీజీయం ఖాదర్ , సూపర్‌వైజర్ లోక్‌నాథ్, స్థానిక నాయకులు సంతుగౌడ్, మధుసూదన్ రెడ్డి, ఎన్ను శంకర్ , రమేష్‌రెడ్డి, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి పలు సమస్యలు


అత్తాపూర్ డివిజన్ పరిధిలో పర్యటిస్తున్న ఈఈ నరేందర్ గౌడ్ తదితరులు


పొంగిపొర్లుతున్న డ్రైనేజీని పరిశీలిస్తున్న దృశ్యం

అత్తాపూర్: డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తూ శిథిలావస్థకు చేరుకున్న రోడ్డు నిర్మాణాలను వెంటనే చేపట్టాలని కోరుతూ అత్తాపూర్ చిక్‌చావనికి చెందిన నాయకులు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక నాయకులు, రాజేంద్రనగర్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈఈ నరేందర్‌గౌడ్‌తో కలసి అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. నాణ్యతా లోపం కారణంగా అభివృద్ధి పనులు బూడిదలో పోసిన పన్నీరుగా మారుతుందని తెలిపారు. సుదీర్ఘ కాలంగా మన్నికతో కూడిన పనులను వెంటనే ప్రారంభించాలని వారు కోరారు. చిక్‌చావని సంతోష్ ఎలక్ట్రానిక్ దుకాణ సముదాయం వెనుక భాగంలో డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతుందని, ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు పూర్తిగా ధ్వంసం అయిందని ఆ మార్గాలగుండా ప్రయాణించే స్థితిలో లేవని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నవాజుద్దీన్, ప్రవీణ్, నవదీప్ సింగ్, ధీరజ్, రమేష్, మహ్మద్ మోసిన్ తదితరులున్నారు.

జాలర్లపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

- రూ. 11వేలు లాక్కుని పరార్
- నేను రౌడీ షీటర్‌నని బెదిరింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన జాలర్లు

మణికొండ: చెరువులో చేపలు పట్టుకుంటున్న జాలర్లను కత్తులతో దాడి చేసి వారి నుంచి రూ.11వేలు లాక్కునిపోయిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీరంచెరువులో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పీరం చెరువులో ప్రతి రోజూ చేపలు పట్టే జాలర్లు రాత్రి సమయంలోను చెరువు వద్దనే నిద్రిస్తారు. సోమవారం రాత్రి సందీప్, రాము, శ్రావణ్‌లతో పాటు మరో ఇద్దరు జాలర్లు చెరువు కట్టపై పడుకున్నారు. వారి వద్దకు నాలుగు బైక్‌లపై తెల్లవారుజామున 4 గంటలకు ఎనిమిది మంది వచ్చారు. వారు పడుకున్న చోటునుంచే వాహనాలతో పెద్దగా చప్పుడు చేస్తూ వెళుతుండటంతో ఒకరు వారిని వారించారు. దీంతో వారి మధ్య గొడవ మొదలయ్యింది. గొడవ పడుతున్న జాలరికి మద్దతుగా సందీప్ అనే జాలరి వచ్చి వారిస్తుండగా కత్తితో అతనిపై దాడి చేశాడు. వారి వద్ద ఉన్న డబ్బు, విలువైన వస్తువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వారి వద్ద ఉన్న రూ. 11వేలు ఇచ్చేశారు. జాలర్లను భయపెట్టిన వారిలో ఒకడు నా పేరు షూటర్ ఇర్ఫాన్ అని, ఖలీజ్‌ఖాన్ దర్గాలో ఉంటానని, ఇప్పటి వరకు 34 మర్డర్‌లు చేశానని, వారం రోజుల క్రితమే జైలు నుంచి వచ్చానని, మిమ్మల్ని సైతం చంపేస్తానని అని బెదిరించినట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. గాయాలైన జాలరినీ సమీపంలోని షాదాన్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మంగళవారం ఉదయం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిను వివరణ అడగగా ఫిర్యాదు వచ్చింది వాస్తవమేనని, దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను పట్టుకుని వివరాలను వెల్లడిస్తామని, అందుకు ప్రత్యేక టీములు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలి


రోడ్డుపై భారీగా ధ్వంసమైన భూగర్భడ్రైనేజీ దృశ్యం

అత్తాపూర్: గ్రామ పంచాయతీ కాలం నాటి కచ్చా మోరీలను ఆధునీకరించకుండానే సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టడంతో ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అత్తాపూర్ గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్తాపూర్ భరత్‌నగర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో వర్షాకాలం వచ్చే భారీ వరదల్లో ప్రమాదవశాత్తు కాలుజారి ఈ భారీ హోల్‌లో పడే ప్రమాదం ఉంది. ఏదైనా ప్రమాదం జరిగితే కానీ స్పందించని అధికారులు రానున్న వర్షాకాలం నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా పటిష్ట చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అత్తాపూర్ బ్రాండ్‌ను ఉపయోగించుకుంటూ వ్యాపారాలు చేసుకుంటున్న బహుళ అంతస్తుల నిర్మాణదారులు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన భూగర్భడ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాల్సి ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు అధికారులు దృష్టిసారించి తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టకుండా యుద్ధ ప్రతిపాదికన పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

అభివృద్ధి పనుల మంజూరుపై కాలనీల వాసుల హర్షం

బండ్లగూడ: ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ప్రతినిధి ప్రేమ్‌గౌడ్ అన్నారు. కౌన్సిల్ సమావేశంలో రూ. 51.11 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిన సందర్భంగా మంగళవారం ఓంనగర్ కాలనీలో ఘనంగా సన్మానించారు. ఓంనగర్ కాలనీ అధ్యక్షులు నవీన్‌కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేటర్‌లో మునుపెన్నడూ కేటాయించలేనన్ని నిధులు నూతన మేయర్ మంజూరు చేయించారన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తున్నామన్నారు. త్వరలోనే ఓంనగర్ కాలనీ, ఎస్ఎం ఎన్‌క్లేవ్, సిఎల్ విల్లాస్, ద్వారకామణి కాలనీ, ఆనంద్‌నగర్ ఎన్‌క్లేవ్, ఆనంద్‌నగర్, దస్తగిరి లేఅవుట్, రాధా రియాల్టీకాలనీ, సరస్వతీ కాలనీ, మాచన్‌పల్లి కాలనీ, ఇందిరమ్మకాలనీ తదితర ప్రాంతాల్లో మంజూరైన పనులను త్వరలో ప్రారంభించి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, బాపురెడ్డి, కిరణ్‌గౌడ్, ప్రదీప్, కమల్‌రెడ్డి, బుజ్జి, కిరణ్, శ్రీనివాస్, వెంకటేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌గౌడ్.


మియాపూర్ పటేల్ చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క

చెరువులు కలుషితం

గుర్రపుడెక్క, మురుగుమయం ● దోమల నివారణ చర్యలు శూన్యం ● ఇబ్బందిపడుతున్న పరిసర ప్రాంతవాసులు

మియాపూర్: చెరువులు, కుంటలు కలుషితమై దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. డ్రైనేజీ, వ్యర్థ జలాలు, చెత్త ఇలా అన్నీ చెరువుల్లోకి చేరిపోతున్నాయి. ఓ వైపు గుర్రపు డెక్క , మరో వైపు చెరువుల వద్ద వ్యర్థాలు పారబోస్తుండడంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. చెరువులు, నాలా పరీవాహక ప్రాంతవాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మియాపూర్ గురునాథం చెరువు, పటేల్ చెరువు, రామసముద్రం చెరువు, మక్తమహబూబ్‌పేట్ చెరువు, రేగులకుంట చెరువు, నాయినమ్మ కుంట చెరువు, కిందికుంట చెరువులు చాలా వరకు కలుషితమయ్యాయి.

- ఏటా చెరువుల్లో గుర్రపుడెక్క తొలగించేందుకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితం నెరవేరడం లేదు. చెరువుల్లో మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకుంటామన్న ప్రజాప్రతినిధులు, అధికారుల హామీలు అలాగే మిగిలిపోయాయి.
- చెరువుల్లో దోమల మందు పిచికారీ, నివారణ చర్యలు తీసుకోకపోవడంతో దోమలు ప్రబలుతున్నాయి.
- మియాపూర్ పటేల్ చెరువు, గురునాథం చెరువు, మక్తమహబూబ్‌పేట చెరువు, బీకే ఎన్‌క్లేవ్ వద్ద కిందికుంట చెరువు, రామసముద్రం చెరువు, నాయినమ్మ కుంట చెరువుల అభివృద్ధి పనులను 3 సంవత్సరాల కిందట చేపట్టారు. నేటికి సగభాగం కూడా పూర్తి కాలేదు.


మియాపూర్‌లోని నాయినమ్మ చెరువు

- చుట్టుపక్కల కాలనీల నుండి మురుగు చెరువులోకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- చెరువులు,నాలా పరిసరాల ప్రాంతాల్లో నివాసముండే వారు సాయంత్రం, రాత్రి తలుపులు, కిటికీలు తెరిస్తే ఇక అంతే సంగతులు.
- దోమ కాటుతో డెంగ్యూ, మలేరియా, విష జ్వరాల బారిన పడుతున్నామని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఫాగింగ్ చేయాలని కోరారు.
- చెరువుల్లో మురుగునీరు కలవకుండా గుర్రపుడెక్క విస్తరించకుండా చర్యలు చేపట్టాలి. చెరువు చుట్టుపక్కల ప్రాంతాలు, కాలనీల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


గురునాథం చెరువు

కాలనీ చెంతకు బ్యాంకు సేవలు!

కమర్షియల్ ప్రాంతాల్లో కాకుండా కాలనీలకు దగ్గరగానే శాఖలు


ఓయూ కాలనీలో ది ఈనాడు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును ప్రారంభిస్తున్న సంస్థ

లక్డీకాపూల్: మారుతన్న కాలానుగుణంగా నగరవాసులు గేటెడ్ కమ్యూనిటీ హౌస్, ఫుల్లీ లోడెడ్ కాలనీలు తదితర కాలనీల్లోనే నివసించేందుకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఎందుకంటే ఇక్కడ ఇతర ప్రాంతాల్లో ఉన్న మాదిరిగానే వసతులతోపాటు పిల్లలు ఆడుకునేందుకు అన్నీ సౌకర్యాలు ఉండటమే కారణం. ఈ నేపథ్యంలో ఆయా కాలనీవాసులకు బ్యాంక్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో తమ బ్రాంచ్‌లను ఏర్పాటు చేసేందుకు నగరంలోని ఓ కో–ఆపరేటివ్ బ్యాంక్ ముందుకు వచ్చింది.

వృద్ధులకు ఒక శాతం అదనపు వడ్డీ..

షేక్‌పేట ఓయూ కాలనీలో ది ఈనాడు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు తన నూతన శాఖను ఏర్పాటు చేసింది. ఇటీవల ఆ బ్యాంక్ చైర్మన్ జెట్టి గోపిచంద్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమర్షియల్ ప్రాంతాల్లో కాకుండా కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఉండే నివాసితులకు బ్యాంకింగ్ సేవలు అందించేందుకు తమ బ్యాంక్ బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తాము ముందు నుంచి కూడా కమర్షియల్ ప్రాంతాల్లో కాకుండా కాలనీలకు దగ్గరగానే శాఖలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాజాగా 7వ బ్రాంచ్‌ని ఏర్పాటు చేశామని మరో 20 రోజుల్లో నగరంలోని కాలనీలలో కొత్తగా రెండు బ్రాంచీలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. 80 సంవత్సరాల వయసు దాటిన వృద్ధులకు సాధారణ వడ్డీతో పాటు అదనపు 1 శాతం వడ్డీని సైతం తాము అందిస్తున్నామన్నారు.

బోనాలపై సమీక్ష సమావేశం

గోల్కొండ: గోల్కొండ కోట శ్రీ జగదాంబ మహంకాళీ అమ్మవారి బోనాల ఏర్పాట్లపై నేడు గోల్కొండ కోటలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు తెలిపారు. జులై 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అమ్మవారి ఆషాఢ మాసం బోనాల ఏర్పాట్లపై జరుగుతున్న ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా, బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారు.

పారిశుద్ధ్యం పద్ధతిగా జరగాలి


వట్టినాగులపల్లిలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేసిన చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్‌లు

నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో పకడ్బందీగా, పద్ధతిగా పారిశుద్ధ్య పనులు జరగాల్సిందేనని, అందులో విఫలమయ్యే వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు, సూపర్ వైజర్‌లపై చర్యలు తప్పవని చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు ఆదేశించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో కౌన్సిలర్ బి.యాదమ్మతో కలిసి పారిశుద్ధ్య పనులను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లపై, వాటి పక్కనా ఎక్కడా చెత్త కనిపించవద్దన్నారు. ఎక్కడైనా చెత్త కుప్పలు పేరుకుని ఉంటే వెంటనే తొలగించాలన్నారు. రాబోయే వర్షాకాలంలో అలాంటి చెత్త మ్యాన్‌హోల్‌ల వద్ద ఇరుక్కుని నీటిని సాఫీగా వెళ్లనివ్వకుండా చేసి, లోతట్టు ప్రాంతాలను ముంచి వేస్తాయన్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి అవసరమైన వర్షాకాల సామగ్రిని ఇప్పటికే అందించామని, వాటిని ఉపయోగించుకుని నిర్విరామంగా సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య ఇంచార్జి లచ్చిరాంతో పాటు సూపర్‌వైజర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో నిథమ్ కోర్సులు

రాయదుర్గం: ఇంటర్ పాసైన విద్యార్థులకు గచ్చిబౌలిలోని నిథమ్‌లో పర్యాటక, ఆతిథ్య కోర్సులు అందుబాటులో ఉన్నా యని నిథమ్ ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ కిరణ్మయి, మిషెల్లీ జే ఫ్రాన్సిస్ మంగళవారం వెల్లడించారు. 30 ఎకరాల స్థలంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన క్యాంపస్ అందుబాటులో ఉందన్నారు. నాలుగు ఏళ్ల కాలపరిమితితో కూడిన బీబీఏ డిగ్రీ (టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ), మూడేళ్ళ కాలపరిమితితో కూడిన బీఎస్సీ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) వంటి కోర్సులు ఉన్నాయన్నారు. 40 శాతం మార్కులతో పాసైన వారు చేరవచ్చన్నారు.

ప్రజావాణిలో నిరుద్యోగుల ఆవేదన

- కానిస్టేబుల్‌గా సెలక్ట్ అయిన 170 మందికి ఇవ్వని ఆర్డర్లు
- ప్రభుత్వ వైఖరిపై నిరుద్యోగుల మండిపాటు
- సమస్యలను అడిగి తెలుసుకున్న ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య

లక్డీకాపూల్: పోలీసు కానిస్టేబుల్‌గా సెలక్ట్ అయిన తమకు నియామక పత్రాన్ని ఇవ్వకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తమపై మోపబడిన తప్పుడు కారణంగానే ట్రైనింగ్‌కి వెళ్లడానికి ఆర్డర్ కాపీ ఇవ్వలేదని వాపోయారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం వివిధ రంగాలకు చెందిన నిరుద్యోగులు తమ తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సెలెక్ట్ కానిస్టేబుల్ అభ్యర్థులు ప్రజావాణి వద్ద బైఠాయించారు. తమపై బనాయించిన కేసులపై న్యాయస్థానం నిర్దోషులుగా అక్విటెడ్‌గా తేల్చినా తమకు ఆర్డర్ ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఇప్పటికే ఎస్‌బి విచారణలో వివరించామని పేర్కొంటూ ప్రభుత్వ వైఖరితో 170 మంది భవిష్యత్తు అయోమయంగా తయారైందని ఆవేదన చెందారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ఇతర అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా ఈ ప్రజావాణిలో 687 దరఖాస్తులు అందాయి. రెవెన్యూపరమైన సమస్యలపై 225, ఇండ్లకు సంబంధించి 59, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 82, హోంశాఖకు సంబంధించి 47, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 40 ఇతర శాఖలకు సంబంధించి 234 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ నోడల్ అధికారి లచ్చిరెడ్డి తదితరులు అధికారులు పాల్గొన్నారు.

తానీషానగర్ కాలనీ కమిటీ ఎన్నిక


తానీషానగర్ కాలనీ నూతన కార్యవర్గం

మణికొండ: తానీషానగర్ (హుడాకాలనీ) సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆదివారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎస్‌బీ. రాజశేఖర్, ఉపాధ్యక్షునిగా అబ్దుల్ వాహీద్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా బీడీ ఈరన్న, సంయుక్త కార్యదర్శిగా ఎం. కృష్ణకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎ.రంగారెడ్డి, పీఎస్ఎన్ మూర్తి, కోశాధికారిగా కె. వెంకటేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా జి.లింగంగౌడ్, జి.హ‌ఠ్రతాయ, ఎం. సుగునరాజు, టీవీ. రాంమోహన్‌రెడ్డి, వి.వెంకటరమణరెడ్డి, షకీబ్ హొసెన్, సీఎస్ రవికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ రాబోయే రెండు సంవత్సరాల కాలం పనిచేస్తుందని అధ్యక్షుడు తెలిపారు. కాలనీలోని సమస్యల పరిష్కారానికి శక్తి వంతన లేకుండా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ


మండలంలోని కవ్వగూడలో విద్యార్థులను పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

శంషాబాద్ రూరల్ : హిందూ వికాస్ గణేష్ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కవ్వగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దేవిరెడ్డి రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవి తల్లిదండ్రులకు గౌరవం పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సబ్జీరాజు, సుబ్బరాజు, శ్రీనివాస్‌రెడ్డి, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పల్లిలో..

మాజీ సర్పంచు సిద్దేశ్వర్ పుట్టిన రోజు సందర్భంగా సుల్తాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంగీత, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి

నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్


మున్సిపల్ చైర్‌పర్సన్‌ను సత్కరించిన మహిళా సంఘాల నాయకులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని మహిళా సంఘాల అభివృద్ధి, వారి సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఆర్‌పీలు ఆమెను మున్సిపల్ కార్యాయలంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళ ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం పటిష్టంగా ఉంటుందని, సంఘాల అభివృద్ధికి అవసరమైన పనులను తన దృష్టికి తెస్తే వాటిని సాధించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ మస్రత్ (జాను), కోఆర్డినేటర్‌లు చంద్రకళ, సుమలత, హారతిలతో పాటు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎరకు చిక్కని చిరుత

అదనపు కెమెరాల ఏర్పాటుకు చర్యలు

శంషాబాద్ రూరల్: జనాల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత పులి బోనుకు చిక్కలేదు. ఘాంసిమియాగూడ, శంకరాపురం పరిసర ప్రాంతాల్లో చిరుత సంచారం వెలుగు వచ్చిన విషయం తెలిసిందే. చిరుతను బంధించడానికి ఈ నెల 24న అటవీశాఖ అధికారులు ఘాంసిమియాగూడ వద్ద రెండు బోన్లు ఏర్పాటు చేసిన అందులో కుక్కలను ఎరగా పెట్టారు. అంతేకాకుండా బోన్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే వరుసగా రెండు రోజులపాటు చిరుత సంచారం సీసీ కెమెరాల్లో నిక్షిప్తం కాగా, బోన్లు ఏర్పాటు చేసిన తర్వాత చిరుత జాడ కనిపించడం లేదు. దీంతో ఘాంసిమియాగూడ పరిసర ప్రాంతాల్లో మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.